# ఫోటో స్టాట్

వి. రంగరాజు



మే 1997

సిటీ సివిల్‌కోర్ట్ :

కోర్ట్ హాలంతా క్రిక్కిరిసి వుంది. రచయిత రామనాథం బోనులో నిలబడి వున్నాడు. డిఫెన్స్ లాయర్ గౌరీశం తన క్లయింట్ వైపు జాలిగా చూస్తున్నాడు. రామనాథం పైన కోర్టులో కేసు వేసిన మరో రచయిత సింగినాథం తన భారమంతా పబ్లిక్ ప్రాసిక్యూటర్ పరమానందం పైనే వేసి నిశ్చింతగా జడ్జి రాకకోసం ఎదురు చూస్తున్నాడు. కోర్టు హాలు నిశ్శబ్దంగా వుంది.

జడ్జిగారు తన సీటులో కూర్చుని ప్రక్కనే వున్న త్రాసు వైపుకి చూసి గుంభనంగా నవ్వారు. కళ్ళకి గంతలు కట్టుకుని వున్న న్యాయదేవత రచయిత లిద్దర్నీ చూడలేక, జడ్జి తీర్పుని విందామని ఆత్రుతగా ఎదురు చూస్తోంది.

ముందుగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ పరమానందం తన గళం విప్పాడు. జడ్జిగారు చెవులు రిక్కించారు.

"మిలార్డ్! యీ రచయిత రామనాథం నా యొక్క క్లయింట్ సింగినాథం గారి 'పచ్చళ్ళు' అనే కథని కాపీ కొట్టి మారుపేరుతో 'బచ్చళ్ళు' అనే క్రొత్త కథని వ్రాశారు. అది 'ఆరళ్ళు' అనే మాసపత్రికలో ప్రింట్ అయింది. ఇద్దరి రచనల్నీ పరిశీలించి తమరు న్యాయ నిర్ణయం చేయవలసినదిగా కోరుతున్నాను. దోషులని శిక్షించి 'కాపీరైట్' వున్నతిని కాపాడవలసినదిగా నా ప్రార్థన" అని ఆయాసంతో గ్లాస్ మంచినీరు త్రాగి తన వుచితాసనంలో కూర్చున్నాడు.

జడ్జిగారు డిఫెన్స్ లాయర్ గౌరీశం వైపుకి తిరిగి, "మీరు చెప్పేదేమైనా వుందా?" అని అడిగారు.

డిఫెన్స్ లాయర్ గౌరీశం గట్టిగా ఒకసారి తుమ్మాడు. తర్వాత గ్లాస్ నీరు పట్టించాడు. తర్వాత జడ్జి వైపుకి తిరిగి.,

"మిలార్డ్! సింగినాథంగారు 'పచ్చళ్ళు' అనే కథని 1956లో ప్రచురించారు. అప్పుడు మా రామనాథంగారి వయసు ఐదేళ్ళు. అ, ఆలు కూడా

సరిగా రావు. 'బచ్చళ్ళు' అనే కథ 1976లో ప్రింట్ అయింది. రెండు దశాబ్దాల క్రితం కథని కాపీకొట్టి వ్రాయాల్సిన ఖర్మ మా క్లయింట్‌కేం పట్టలేదు. పైగా, 'పచ్చళ్ళు' కథలో గోంగూర వాడారు. మా రైటర్ 'బచ్చళ్ళు' కథలో పుదీనాతో పాటు వుల్లి, వెల్లుల్లి కూడా బాగా ఘాటుగా దట్టించారు. రెండు కథలకీ అసలు పోలికే లేదు మిలార్డ్!" అని గట్టిగా శ్వాస పీల్చి బోను దగ్గర నిలబడ్డాడు.

జడ్జిగారు మళ్ళీ మరొకసారి క్షుణ్ణంగా రెండు కథలను శ్రద్ధగా చదివారు. పి.పి. పరమానందం వైపుకి తిరిగి, 'నీకు ఆఖరి అవకాశం యిస్తున్నాను. సింగినాథం కథని రామనాథం ఖచ్చితంగా కాపీ కొట్టాడని నిరూపించలేకపోతే కేసుని కొట్టేస్తా! సింగినాథం పరువు నష్టం దావా క్రింద ఫీజు కట్టక తప్పదు!' అని సుత్తిని మ్రోగించారు.

గౌరీశం వైపు రామనాథం చురుగ్గా చూశాడు.

సింగినాథం దిగాలుగా పి.పి.నే చూస్తున్నాడు.

"యువరానర్! నాకు అరగంట విశ్రాంతి కావాలి" పి.పి. అన్నాడు.

"పర్మిషన్ గ్రాంటెడ్" అని జడ్జిగారు రిలాక్స్ అయ్యారు.

అరగంటసేపు తీక్షణంగా రెండు కథల్ని చదివిన పి.పి. పరమానందం వుత్సాహంగా తన చేతిలోని పుస్తకాలని జడ్జిగారికి చూపిస్తూ....

"మిలార్డ్! యీ 'పచ్చళ్ళు' కథలో రెండవపేజీలోని పద్నాలుగవ లైనులో - హైద్రాబాద్‌లోని సముద్రం వుప్పొంగుతోంది - అని యీ రచయిత సింగినాథం 1956లో కనుక్కొని మనకు తెల్పారు. అలాగే, యీ 'బచ్చళ్ళు' కథలోని మూడవ పేజీలోని ఇరవైమూడవ లైనులో - హైద్రాబాద్‌లోని సముద్రం పొంగి పొరులుతోంది - అని యీ కాపీ రచయిత రామనాథం 1976లో మళ్ళీ కనుక్కొని మనకు తెలియజేశారు." అన్నాడు పి.పి. పరమానందం.

"ఇంతకీ నీ అభిప్రాయం ఏమిటి?" లాయర్?

"ఏం లేదు మిలార్డ్! హైద్రాబాద్‌లో సముద్రమే లేదు. 1956లో చేసిన తప్పునే 1976లో రచయిత రామనాథం చేశాడు. ఇద్దరూ పాఠకుల్ని బాధించారు.

"సో! సింగినాథం కథని రామనాథం కాపీ కొట్టినట్లు రుజువైంది. ఆయనకు జరిమానా విధిస్తున్నాను". అని తీర్పు చెప్పిన జడ్జిగారు తన ఛాంబర్ వైపుకి వెళ్ళిపోయారు.

సింగినాథం పి.పి. వైపు కృతజ్ఞతగా చూశాడు. రామనాథం తన డి.ఎల్. వైపు చూచి గుడ్లురిమాడు.

కోర్టు హాలంతా ఖాళీ అయిపోయింది. న్యాయదేవత ఆనందభాష్పాలతో కళ్ళు చెమర్చింది.

**మే 1998**
**సిటీ సివిల్ కోర్ట్:**

జడ్జిగారు ఎప్పటిలాగే తన కుర్చీలో కూర్చున్నారు. బోనులో రచయిత సింగినాథం నిలబడి వున్నాడు. పి.పి.ని చూసి జడ్జిగారు, 'ఏమిటి యితనిపై మోపబడిన అభియోగం?' అన్నారు.

పి.పి. వినమ్రంగా "మిలార్డ్! ఈ రచయిత 'పచ్చళ్ళు' కథని కాపీకొట్టి వ్రాశారంటూ మరో హిందీ రచయిత పన్నాలాల్ గారు కేసుపెట్టారు!" అన్నాడు.

జడ్జి విచారంగా అందరివైపు చూసి నిట్టూర్చి,

"హా! హతవిధీ!! పన్నాలాల్‌ని ప్రవేశపెట్టండి!" అని డిఫెన్స్ లాయర్ వైపు చూసారు.

డిఫెన్స్ లాయర్ జడ్జివైపుకి తిరిగి,

"మిలార్డ్! యీ ఫోటోస్టాట్ రచనలమీద రచయితలందరూ ఒకరిమీద మరొకరు ఫిర్యాదులు చేయడానికి కలిసికట్టుగా వచ్చారు యువరానర్!' అని బెంచీల మీద కూర్చొని వున్న ఐదుమందిని చూపించాడు.

బాగా చిర్రెత్తుకొచ్చిన జడ్జి కోపంగా "వరుసగా అందరి ఫిర్యాదులు విన్పించండి" అంటూ కేసు వివరాలు వ్రాయడానికి సిద్ధమయ్యారు.

"సాబ్! యిస్ నే మేరీ కహానీ "సబ్జీమండీ" కో "పచ్చళ్ళు" నామ్ పర్ లిఖ్ దియా!" పన్నాలాల్ తన హిందీ ప్రతిని చూపించాడు.

"సార్! యింద మనిదన్ పన్నాలాల్ ఎన్ కదై "తుహాయిల్" కాపీ పణ్ణి "సబ్జీ మండీ" పేరిల్ ఎలుదినాన్" అంటూ తమిళ ప్రతిని యిచ్చాడు.

కన్నడ రచయిత బంగారప్ప జడ్జిగారికి తన కన్నడ ప్రతిని అందిస్తూ

"సార్! యింద తమిళ రచయితే నన్న "చెట్నీ" కథన్ను కాపీమాడి "తుహాయిల్" హెసరు నింద బరిసిద్దానే" అని కన్నడ కంఠీరవ రాజ్‌కుమార్ స్టయిల్‌లో చెప్పాడు.

మిగిలిన గుజరాతీ, మరాఠీ రచయితలు కూడా తమ వ్రాతప్రతుల్ని జడ్జిగారికి అందజేశారు.

అన్నీ తిరగేసిన జడ్జి చివరికి ఒక నిర్ణయానికి వస్తూ - రచయితలందరి వైపు తేరిపార చూచి -

"అసలు మీ ఫోటోస్టాట్ కథలన్నిటికీ మూల కారకుడైన ఒరిజినల్ కథా రచయిత ఎవరు?" అని ప్రశ్నించాడు.

పి.పి., డి.ఎల్‌లు ముఖాముఖాలు చూసుకున్నారు. గడ్డం క్రింద చెయ్యి పెట్టుకుని తీవ్రంగా ఆలోచించారు. అరగంట తర్వాత కోర్టు లోపలికి పూజా బోర్డ్ వచ్చింది. అక్షరాల మీద వేళ్ళు కదులుతున్నాయి. పది నిమిషాలు గడిచాయి. ఒక్కసారిగా కోర్టు హాలు దద్దరిల్లింది. హాలంతా వురుములు, మెరుపులతో మెరిసింది.

"నీ పేరేమిటి?" అన్నాడు ఆపరేటర్!

"నేను - నేనే బ్రామ్ స్టోకర్‌ని. 'డ్రాకులా' నవలల సృష్టికర్తను. నా నవలలోని భాగాలే యీ రచయితలందరి అనువాదప్రతులు!!!" అని అక్షరాలు పూజా బోర్డ్ మీద కదిలాయి.

జడ్జిగారు అన్ని కేసులనీ కొట్టివేసి, "ద కోర్ట్ యీజ్ అడ్జర్న్‌డ్" అని తన ఛాంబర్‌కి వెళ్ళిపోయారు. ❋



బుల్లి కారు కాదు. ఇది తెగ్గబారెడు పొడవున్న "లిమోజీ" కారు. అమెరికాలో ఇలాంటి పొడవైన కార్లు ఎక్కువ. జాన్ కెన్నడీ ఎయిర్‌పోర్ట్ వద్ద పెద్ద సంఖ్యలో కనిపిస్తాయి. ఈ కార్లు వివిధ రంగుల్లో చూడముచ్చటగా వుంటాయి. దీంట్లో 12మంది కూర్చోవచ్చు. ఇందులో టెలిఫోన్, చిన్న టి.వి. టేప్‌రికార్డర్ సౌకర్యాలున్నాయి. ఈ కార్లు ఎక్కువగా వివాహ సందర్భంగా అద్దెకిస్తారు. ఇందులో ప్రయాణం చేస్తే విమానంలో ప్రయాణం చేసిన అనుభూతి, ఆనందం కలుగుతాయిట.

- అనంత్ ప్రభాకర్ దత్తు